క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని బాలపేట ఫీడర్ పరిధిలో విద్యుత్‌లైన్ల మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఉంటుందని బల్లేపల్లి సెక్షన్ ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫీడర్ పరిధిలోని జయనగర్‌కాలనీ, బల్లేపల్లి, బాలపేట, బాలపేటతండా, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

సమీకృత మార్కెట్‌లో పాము కలకలం

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని బైపాస్ రోడ్ నూతన బస్టాండ్ పక్కన ఉన్న సమీకృత మార్కెట్‌లోని ఓ కిరాణ దుకాణంలో మంగళవారం త్రాచుపాము కలకలం రేపింది. దుకాణంలోని సరుకుల బస్తాల మాటున ఉన్న పామునునిర్వాహకులు గుర్తించి అటవీ శాఖ అధికారులకు ఆపై పాములు పట్టే నిపుణుడు మస్తాన్ సమాచారం అందించి పట్టుకొని సమీప అడవిలోకి వెళ్లి వదిలేశారు.

పోస్టర్లు ఆవిష్కరణ


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని మామిళ్ళగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ ఆధ్వర్యాన రూపొందించిన వాల్ పోస్టర్లను పాఠశాల హెచ్ఎం శాంత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్మీడియట్ చదవాలనుకునే వారు తమ పాఠశాలలో కూడా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది కట్టా శేఖర్, గాయత్రి, కవిత, శ్రీదేవి, శరత్‌కుమార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

5న ఆందోళన..

ఖమ్మం సహకారనగర్: జీపీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 5వ తేదీన జెడ్పీ ఎదుట ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, ఎస్.విజయ్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీపీఎఫ్ నిధుల నుంచి రుణాలు మంజూరు చేయాలని, మిస్సింగ్ క్రెడిట్స్, పదవి విరమణ పొందిన వారికి ఇవ్వాల్సిన ఫైనల్ పేమెంట్స్ తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ ఆందోళన కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

దుకాణాదారులపై ఫిర్యాదు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సమీపాన ఉన్న చికెన్, మటన్ దుకాణాల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తుండటంతో కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయని, దుర్వాసనతో అవస్థ ఎదురవుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు ఎక్సైజ్ సీఐ, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సహా పలువురు వినతిపత్రంపై సంతకం చేయగా, నకిరికంటి కృష్ణమూర్తి పోలీసులకు అందజేశారు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు.

పాలాభిషేకం..

రఘునాథపాలెం: ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని కోయచలకకు చెందిన ఆర్టీసీ డ్రైవర్లు సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. చెరుకూరి అబ్బాస్, అమరం వెంకట్, గుంటి బ్రహ్మం, హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి

ఖమ్మంమయూరిసెంటర్: సీజనల్ వ్యాధులు, కళ్ల కలక వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో వెంటనే విద్యా సంస్థలు, సంక్షేమ వసతిగృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి వి.వెంకటేష్ కోరారు. మంగళవారం ఈమేరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యాన అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాక మాట్లాడారు. వైరల్ ఫీవర్ వస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, లేనిపక్షంలో ఆందోళ న చేస్తామని హెచ్చరించారు. సంఘ నాయకులు లక్ష్మణ్, శ్రీకాంత్, నరేందర్, వినయ్, కరుణ్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	బేబి
వినోద	హిడింబ, బ్రో
సాయిరాం	బ్రో
ఆదిత్య	బ్రో
శ్రీనివాస	సామజవరగమన, బ్రో, స్లమ్‌డాగ్ హస్‌బెండ్(తె)

– ఖమ్మంవ్యవసాయం

అభివృద్ధికి ఆమడ దూరంలో..

సుందరయ్యనగర్ శివారు ప్రాంతాలు

- రోడ్లు వేయరు.. కరెంటు ఇవ్వరు...
- విద్యుత్ సౌకర్యం కోసం డీడీలు చెల్లించినా ప్రయోజనం శూన్యం
- కనీస సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు



సుందరయ్యనగర్ శివారు ప్రాంతంలోని మట్టి రోడ్డు (ఇన్‌సెట్) కాలనీలో నిలిచిన వరద నీరు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని త్రీటౌన్ సుందరయ్యనగర్ శివారు ప్రాంతం అభివృద్ధికి నోచుకోవటం లేదు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 29, 30 డివిజన్లకు అనుసంధానం ఈ ప్రాంతంపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించకపోవడంతో కనీస సౌకర్యాలు లేక కాలనీవాసులు నానా ఇబ్బందులు పడుతున్నారు. సుందరయ్యనగర్ ఎఫ్‌సీఐ గోదాముల వద్ద నుంచి మలిశెట్టి గార్డెన్స్, పార్క్ ఏరియా వరకు, ప్రకాష్‌నగర్ వైపుకు ఉన్న ఈ ప్రాంతంలో సమస్యలు విలయతాండవ చేస్తున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో నివసించే కార్మికులు, పేద, మధ్య తరగతి వర్గాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

పెరిగిన మరింత ఇబ్బంది..

ఇటీవల కురిసిన వానలతో వరదలు ఉప్పొంగి.. అక్కడి ప్రజలకు మరింత కష్టాలను కొనితెచ్చి పెట్టింది. ఈ ప్రాంతంలో రహదార్లు, డ్రైయిన్లు, విద్యుత్, మంచినీటి సౌకర్యం వంటి కనీస సౌకర్యాలు లేవు. వానాకాలం వస్తే ఈ రోడ్లన్నీ బురదమయంగా మారడంతో రాకపోకలు సాగించేందుకు నర(డ)కయాతన పడాల్సి పరిస్థితి నెలకొంది. అంతేకాక మంచినీటి పైపులైన్లు లేకపోవటంతో తాగునీటి కోసం నానా తంటాలు పడుతున్నారు. ఇక కరెంటు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. ఖాళీ ప్లాట్లలో నీరు నిల్వ ఉండటంతో మురుగువాసనతో పాటు దోమలతో ప్రజలు అనారోగ్యాల బారీన పడుతున్నారు.

విద్యుత్ మీటర్ల కోసం డీడీలు..

ఈ ప్రాంతంలో శాశ్వత ఇళ్ల నిర్మాణాలు చేసుకొని అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఈమేరకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని మీటర్ల కోసం డీడీలు చెల్లించి అధికారులు చుట్టూ తిరగాల్సి వస్తోంది. ఆ ప్రాంతం గుండా ముదిగొండ వంటి ప్రాంతాలకు విద్యుత్ మెయిన్ లైన్లు ఉన్నప్పటికీ, కాలనీవాసులకు విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం లేదు. ప్రభుత్వ శాఖలు సౌకర్యాలు కల్పిస్తాయనే ఆశతో అనేక మంది ఇళ్లు నిర్మించుకున్నారు కానీ వాటిని ప్రభుత్వ శాఖలు విస్మరించటంతో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు.

మీటర్ కోసం పైకం చెల్లించా..



ఇళ్లు నిర్మించుకొని రెండేళ్లవుతుంది. విద్యుత్ లైను వేయమని ఆ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. విద్యుత్ సరఫరా కోసం పైకం కూడా చెల్లించా. శివారు ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా అధికారులు పట్టింపు లేకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.

– వాంకుడోత్ హరి, సుందరయ్యనగర్

కనీస సౌకర్యాలు లేవు..



ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తూ సమీప ప్రాంతంగా భావించి 90 గజాల స్థలం కొని ఇల్లు కట్టాను. కానీ శివారు ప్రాంతం కావటంతో అభివృద్ధికి నోచుకోవటం లేదు. రహదార్లు, విద్యుత్, తాగునీటి లైన్ ఏర్పాటు చేయాలి.

– బండిపల్లి నరేష్, కార్మికుడు, సుందరయ్యనగర్ శివారు ప్రాంతం

ప్రజల విశ్వాసంతోనే ముందడుగు


మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రాజు, పక్కన పువ్వాడ నాగేశ్వరరావు

ఖమ్మంవ్యవసాయం: ది సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ ప్రజల విశ్వాసంతో ముందడుగు వేస్తోందని మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన సొసైటీ ఖమ్మం బ్రాంచ్ సభ్యుల సమావేశంలో ఆయన ముఖ్య మాట్లాడారు. వాసిరెడ్డి హన్మంతరావు స్థాపించిన సొసైటీ 25ఏళ్లు పూర్తి చేసుకోగా, 112 బ్రాంచ్‌లతో సాగుతోందని తెలిపారు. సొసైటీ చైర్మన్ పీఆర్‌వీపీఎస్.రాజు మాట్లాడుతూ.. సొసైటీ లావాదేవీలు రూ.3,500 కోట్లు దాటడంలో సభ్యుల సహకారం మరువలేనివని చెప్పారు. సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ సుబ్బయ్య మాట్లాడగా, పలువురు సభ్యులను సన్మానించారు. బ్రాంచ్ ఉద్యోగులు జి.సాయిబాబు, కె.సైదేశ్వరరావు, టి.ప్రమోద్‌కుమార్, టి.పూర్ణయ్య, కె.రాజేష్, జి.హరీష్, సీహెచ్.రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటిని కలిసిన అగ్రిగోల్డ్ బాధితులు


పొంగులేటికి వినతి అందిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

ఖమ్మంరూరల్: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అగ్రిగోల్డ్ బాధితులు మంగళవారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బాధితులు తమ సమస్యలను వివరించారు. తాము కంపెనీకి డబ్బులు చెల్లించి పదిహేనేళ్లు దాటినా నేటికి తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈమేరకు సమస్య పరిష్కారానికి కృషి చేయడంతో పాటు త్వరలోనే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని అపాయింట్‌మెంట్ ఇప్పిస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో రామారావు, వీరబ్రహ్మాచారి, ఉరుకొండ. రాజు, జమ్మి వీరబాబు, కృష్ణయ్య, నాగేశ్వరరావు, అనసూర్య, హైమావతి, భారతి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద మహిళకు కుట్టు మిషన్..

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కవిరాజ్‌నగర్‌కు చెందిన సుంచు లక్ష్మి అనే నిరుపేద మహిళకు తెలంగాణ కాంగ్రెస్ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుట్టుమిషన్‌ను తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం అందజేశారు. అలాగే వివాహం కాబోతున్న ఓ ముస్లిం యువతికి పట్టువస్త్రాలను అందజేశారు. అంతకుముందు ఓ ఫంక్షన్ హాల్‌లో సీబీఎస్ కార్ గ్యారేజ్ తరఫున మున్నేరు ముంపు బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించారు. అనంతరం శీనన్న సైన్యం జాయిన్ ద మిషన్-2023 సామాజిక మాధ్యమ కరపత్రాన్ని పొంగులేటి ఆవిష్కరించారు.

వరద బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలి

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల వచ్చిన వరదలకు నష్టపోయిన మున్నేరు పరివాహక ప్రాంతాల బాధితులకు రూ.2లక్షల పరిహారం ఇవ్వాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి, పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వీ.రాకేష్‌లు డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని మున్నేరు పరివాహకంలోని ముంపు ప్రాంతాల్లో ఆయా సంఘాల నాయకులు పర్యటించి, ప్రజలతో మాట్లాడారు. అనంతరం వారు మాట్లాడుతూ.. మున్నేరు వరదకు సర్వం కోల్పోయి నిస్సాహాయస్థితిలో ఉన్నారని, నష్టపోయిన ప్రతీ కుటుంబానికి రూ.2 లక్షలు, పూర్తిగా ఇళ్లను కోల్పోయిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోకినేపల్లి లలిత, టి.ఝాన్సీ, నాయకులు మంగతాయి, మోహన్‌రెడ్డి, చందు, వెంకటేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు..


నిత్యావసరాలు అందిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఖమ్మంగాంధీచౌక్: నగరంలో మున్నేరు వరద బాధితులకు కిరాణం అండ్ జాగిరి మర్చంట్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన మంగళవారం నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. రూ.60 వేలు విలువ చేసే 12 రకాల నిత్యావసరాలను 46వ డివిజన్‌లోని 100 కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కిరాణం అండ్ జాగిరి మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిల్లంచర్ల రాధాకృష్ణ, ఉపాధ్యక్షులు వేములపల్లి శ్రీనివాసరావు, కుక్కడపు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వజ్రపు చక్రపాణి, కోశాధికారి పుల్లఖండం వినయ్, సహాయ కార్యదర్శులు రాయపూడి వీరేందర్, అర్వపల్లి జయప్రకాష్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు కన్నెం ప్రసన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

కామేపల్లి(కారేపల్లి): మండల పరిధిలోని కొత్తలింగాల గ్రామంలో కొలువుదీరిన శ్రీకోటమైసమ్మతల్లి ఆలయ నెలన్నర హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, ఆలయ కార్యనిర్వాహణాధికారి నల్లమోతు శేషయ్యల ఆధ్వర్యాన హుండీ లెక్కించగా.. రూ.41,953 ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ బడాటి వరప్రసాద్, సిబ్బంది శ్రీకాంత్, సుజాత పాల్గొన్నారు.

నేపాల్ మహిళకు అంత్యక్రియలు


మృతదేహాన్ని తరలిస్తున్న ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మం వైద్యవిభాగం/ఖమ్మంక్రైం: నేపాల్‌కు చెందిన రేషం కలి సర్కి(58) ఇటీవల నేపాల్ నుంచి కేరళకు రైల్లో ప్రయాణిస్తూ ఖమ్మం దగ్గర ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెందింది. ఈనేపథ్యంలో రైల్వే పోలీసులు మృతురాలి కుటుంబసభ్యులకు సమాచారం అందివ్వగా వారు ఖమ్మం చేరుకుని సదరు మహిళ మృతదేహాన్ని నేపాల్ తీసుకెళ్లే ఆర్థిక స్తోమత లేకపోవడంతో అన్నం ఫౌండేషన్‌ను సంప్రదించారు. ఈమేరకు ఫౌండేషన్ బాధ్యులు రైల్వే పోలీసులు, వైద్యశాల సిబ్బంది, కుటుంబ సభ్యుల సమక్షంలో మార్చురీ నుంచి మంగళవారం మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు సిబ్బంది, మృతురాలి కుమారుడు చెట్ బహదూర్ సర్కి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దుకాణాలు తొలిగించాల్సిందే!

నేలకొండపల్లి: మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల వద్ద ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసుకున్న దుకాణాలను వెంటనే తొలిగించాలని ఆర్‌అండ్‌బీ జేఈ దేవేందర్ ఆదేశించారు. మంగళవారం ప్రభుత్వ పాఠశాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మిస్తున్న పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణం పనులను పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రహరీ నిర్మాణ పనులకు ఇబ్బందిలేకుండా రెండు రోజుల్లోగా దుకాణాలు తొలిగించాలని సూచించారు. రహదారికి ఇరువైపులా 50 అడుగుల ప్రభుత్వం స్థలం ఉండాలని అన్నారు. ఆయన వెంట సర్పంచ్ రాయపూడి నవీన్, ఉప సర్పంచ్ లక్కం కొండలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి..

రఘునాథపాలెం: పంచాయతీ కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడి వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి శింగు నర్సింహారావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారం నాటికి 27వ రోజుకు చేరగా.. సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. జేఏసీ నాయకులు రాందాస్, నారాయణ, మంగీలాల్, రాజగోపాల్, చుక్కయ్య, లింగయ్య, మధు, నెహ్రూ, వీరయ్య, ఉపేందర్, కోటేశ్వరరావు, సైదులు, నాగరాజు, రంజాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నిషేధంపై నిరసన


దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలు ప్రవేశించకుండా విధించిన నిషేధాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన మంగళవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కులు, సమస్యలపై పోరాడే సంఘాలకు విద్యా సంస్థల్లో ప్రవేశంలేదనడం ప్రభుత్వం యొక్క నియంతృత్వ దోరణికి అద్దం పడుతుందన్నారు. విద్యా సంస్థల్లో జరిగే అనేక అక్రమాలను వెలుగులోకి తెస్తున్న కారణంగానే విద్యార్థి సంఘాలను నిర్బంధాలకు గురి చేస్తుందన్నారు. విద్యాశాఖ ఇచ్చిన ఆదేశాలు వెనక్కి తీసుకునే వరకు పోరాటాలు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నవీన్, సతీష్, పవన్, రమ్య, స్వాతి, అనురాధ, ఉమామహేశ్వరి, వెంకటేష్, గోపి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు

ఖమ్మం మామిళ్లగూడెం: ఈనెల 9న సినీనటుడు మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా నేడు (బుధవారం) నుంచి వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్ సేన జిల్లా గౌరవ అధ్యక్షుడు తోట రంగారావు తెలిపారు. మంగళవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 5న బుర్హిపాలెంలో సూపర్‌స్టార్ కృష్ణ కాంస్య విగ్రహ ఆవిష్కరణ, 8న ఖమ్మం వర్తక సంఘ భవనంలో పేద మహిళలకు చీరల పంపిణీ, మొక్కలు నాటడం, అన్నదానం, 9న కేక్ కటింగ్‌తో పాటు రక్తదాన శిబిరం ఏర్పాటు వంటి తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో నగర అధ్యక్షుడు మునగాల బాబు, గౌరవ అధ్యక్షుడు బ్రహ్మం, వెంకన్న, సత్యనారాయణ, వీరబాబు, వెంకటేశ్వరావు, అశోక్, సంపత్, మోహన్‌రావు, గౌతమ్, శివ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మంమయూరిసెంటర్: కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా లేబర్ కార్డులు పొందిన వారికి ప్రభుత్వం సంక్షేమ ఫలాలు పొందలేకపోతున్నారని భవన నిర్మాణ కార్మిక సంఘం(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ పటేల్ అన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యాలయంలో జరిగిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కార్డులు ఇచ్చి రావాల్సిన బెనిఫిట్స్ మంజూరు చేయకుండా సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని విమర్శించారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ నాయకులు జి.రాజా, కె.శ్రీను, దాసు,అశోక్, ఉపేందర్, సైదారావు, పాషా, నర్సింహారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

తిరుమలాయపాలెం: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామారావు తెలిపారు. సోమవారం మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం వ్యాపిస్తున్న కళ్ల కలక ఇతర సీజనల్ వ్యాధుల గురించి అవగాహన కల్పించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అదే విధంగా పిండిప్రోలు కళాశాలలో ఒకేషనల్ కళాశాల భవన నిర్మాణానికి రూ. కోటి మంజూరు చేయించిన ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి కృతజ్ఞతగా ఎమ్మెల్యే కుమార్తె దీప్తిని కళాశాల యాజమాన్యం సన్మానించింది. కళాశాలకు ఆరు కంప్యూటర్లు, విద్యార్థులకు యూనిఫాం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎస్ఎస్ఎస్ పీఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కోనాయిగూడెంలో డ్రైడే..


నిల్వ నీటిని తొలగిస్తున్న దృశ్యం

నేలకొండపల్లి: పారిశుద్ధ్యంపై ప్రజలు అప్రమతంగా ఉండాలని కోనాయిగూడెం సర్పంచ్ పెంటమళ్ల పుల్లమ్మ సూచించారు. గ్రామంలో మంగళవారం డ్రైడే కార్యక్రమం నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ ఉప సర్పంచ్ వల్లమూడి నర్సయ్య, కార్యదర్శి బోళ్ల వీరబాబు, గ్రామదీపిక కొమ్మినేని పుష్పావతి, అంగన్‌వాడీ టీచర్ వల్లమూడి నాగమణి, ఆశా కార్యకర్త చెరుకుపల్లి బేబి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత


నగదు అందిస్తున్న విజయమ్మ

ఖమ్మంరూరల్/తిరుమలాయపాలెం: మండలంలోని గుదిమళ్ల కేబీఆర్‌నగర్‌కు చెందిన షేక్.జహీర్ పాముకాటుతో మృతి చెందగా.. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి సతీమణి విజయమ్మ మంగళవారం జహీర్ కుటుంబసభ్యులను పరామర్శించి రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. అనంతరం గుర్రాలపాడు, వెంకటగిరి, గుదిమళ్లలోని ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందిన 15 మంది కుటుంబసభ్యులకు ఒక్కో కుటుంబానికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమా, బీఆర్ఎస్ నాయకులు చుంచు నారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఎమ్మెల్యే కందాల కుమార్తె దీప్తి ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేసి ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. సురేందర్‌రెడ్డి, చామకూరి రాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

నేలకొండపల్లి: చెరువుమాధారం ఎస్సీ బాలుర వసతి గృహం సంక్షేమాధికారిగా ఆర్.ఓదెలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ అధికారిగా ఉన్న నేలకొండపల్లి వసతి గృహం అధికారి బాలకృష్ణ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమ విషయంలో రాజీపడకుండా చూస్తామని అన్నారు. అనంతరం వసతి గృహం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యార్థులతో ముచ్చటించారు.

గురుకుల పాఠశాల సందర్శించిన నాయకులు


పాఠశాలను పరిశీలిస్తున్న రాయల

ఖమ్మంరూరల్: మండలంలోని దానవాయిగూడెంలో గల గురుకుల పాఠశాలను టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు మంగళవారం సందర్శించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. వర్షాలకు పాఠశాల ఆవరణమంతా బురదమయంగా మారిందని, అందుకు మట్టి తోలిస్తానని హామీ ఇచ్చారు. నాణ్యమైన విద్య అందించడంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని, కాస్మోటిక్స్ ఇవ్వాలని తెలిపారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని ఐసీడీఎస్ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. మంగళవారం మండల్లాలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని తల్లిపాల విశిష్టతను ఇంటింటికి తిరిగి తల్లులు, గర్భిణులకు వివరించారు. ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. – సాక్షి నెట్‌వర్క్


తిరుమలాయపాలెం: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ బాలత్రిపుర సుందరి


నేలకొండపల్లి: చెరువుమాధారంలో వారోత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ జమలారెడ్డి

ఆర్‌సీసీ వాల్ నిర్మాణంపై హర్షాతిరేకాలు


పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్నేరు పరివాహక ప్రాంతంలోని ముంపు ప్రజల దశాబ్దాల కలను సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌లు మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ నిర్మాణంలో సాకారం చేశారని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఈమేరకు మున్నేరు ఒడ్డున బతుకమ్మల గాట్ వద్ద సీఎం కేసీఆర్, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చిత్రపటాలకు సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, ఆర్జేసీ కృష్ణ, మంత్రి పీఏ చిరుమామిళ్ల రవికిరణ్‌లు పాలాభిషేకం చేశారు. అలాగే మున్నేరు వరదతో భయంభయంగా గడుపుతున్న ప్రజలకు ఆర్‌సీసీ వాల్ నిర్మాణం ప్రకటన కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని మేయర్ పునుకొల్లు నీరజ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అనేక పార్టీలు ఏళ్ల తరబడి ఆయా ప్రాంత ప్రజలను కేవలం తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి మాత్రమే వినియోగించుకున్నారన్నారు. మున్నేరు బాధితులు తమ కష్టలు తొలగించాలని మంత్రి పువ్వాడకు విజ్ఞప్తి చేసి రెండు రోజులు గడవక ముందే కేబినెట్‌లో రూ.150 కోట్లతో ఆర్‌సీసీ వాల్ నిర్మాణానికి ఆమోదం తెలపడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.